కోడ్ ఉల్లంఘనపై..

విజిల్ వేయండి..!



- పౌరులకు అందుబాటులో సీవిజిల్ యాప్
- సామాన్యులు సైతం ఫిర్యాదు చేసే అవకాశం
- ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోనే పరిష్కారం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22: అధికార పార్టీ నేతలు మా ఇష్టం, మమ్మల్ని ఎవరు ఏం చేస్తారు, మనకు అనుమతులు అవసరమా అంటూ బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా అదే పంథాలో కొనసాగుతున్నారు. అనుమతులు లేకుండానే సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల తాయిలాలు ఇవ్వడం చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో సామాన్యులకు సైతం భాగస్వాములను చేస్తోంది. సీవిజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిపై అధికారులు చర్యలు తీసుకునేలా సీవిజిల్ యాప్ సహకరించనుంది.

సీవిజిల్ యాప్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ సీవిజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘటనపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరవచ్చు. ఫొటో లేదా వీడియో ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో ఆ ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించుకోవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

గూగుల్ ప్లే స్టోరులో నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వారి సీవిజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ మొబైల్ నెంబరు ద్వారా దానిలో రిజిస్టరు చేసుకోగానే ఓటీపీ వస్తుంది దాన్ని నమోదు చేస్తే సీవిజిల్ యాప్ సిద్ధం. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపై అయినా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం.. ఇలాంటి ఉల్లంఘటనలు ఫొటో లేదా వీడియో ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ఫిర్యాదు ఎలా చేయాలంటే..

సీవిజల్ యాప్ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

ఐదు నిమిషాల్లో రంగంలోకి..

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా ఫిర్యాదుపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే అవకాశం అందులో ఉంది.

అడ్డుకట్ట వేయాలి

తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికారం పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. రాష్ట్ర దేశ బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలి.



మేమంతా.. మీ వెంటే..

- ఎవ్వరూ అధైర్యపడొద్దు
- బాధితులకు భరోసా ఇచ్చిన నారా భువనేశ్వరి
- 'నిజం గెలవాలి' అంటూ హంగు, ఆర్భాటాలు లేకుండా పర్యటన

సగిలి దేవిడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి



"ఎవ్వరూ అధైర్యపడొద్దు.. టీడీపీ శ్రేణులంతా నా బిడ్డలు.. ఎవ్వరికి ఏ కష్టమొచ్చినా మేమంతా మీవెంటే ఉంటాం.." అని నారా భువనేశ్వరి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తనయ.. పాలనకు దిక్సూచి అయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి... సినీ హీరో నందమూరి బాలకృష్ణ సోదరి.. అయినా నారా భువనేశ్వరి సాదాసీదాగా ఉన్నారు. బాధితుల ఇళ్లకు వెళ్లారు. వారి కుటుంబసభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. భువనేశ్వరిని చూసి తమ ఇంటి ఆడపడుచులా మహిళలు భావించారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఆమె చెరగని చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

కడప, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నారా చంద్రబాబునాయుడును జగన్ సర్కారు స్కిల్ డెవలప్‌మెంటు కేసులో అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక పలువురు ఆయన అభిమానులు గుండెపోటుతో మృతిచెందారు. తప్పుడు కేసులతో చంద్రబాబును జైల్లో పెట్టడం, కార్యకర్తలు చనిపోవడంతో 'నిజం గెలవాలి' పేరుతో నారా భువనేశ్వరి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ బాధితులను పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆమె పోరుమామిళ్ల మండలాల్లో రెండు కుటుంబాలను పరామర్శించారు. శుక్రవారం బి.కోడూరు, కలసపాడు మండలాల్లో నాలుగు కుటుంబాలను పరామర్శించి వారిలో ధైర్యం నింపారు.

మీ వెంటే ఉంటాం

భువనేశ్వరిని చూసి బాధిత కుటుంబాలు బోరున విలపించాయి. టీడీపీతో ఉన్న అనుబంధాన్ని భువనేశ్వరికి వివరించారు. వారి ఆవేదనను చూసి భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. మీరంతా టీడీపీ కుటుంబం. మీకు చంద్రబాబు, నారాలోకేశ్ సహా పార్టీ అంతా మీ వెంటే ఉంటుంది. మీకు ఏ కష్టమొచ్చినా పార్టీ వెంట ఉంటుంది. మీరు అధైర్య పడొద్దు అంటూ భరోసా ఇచ్చారు.

రాష్ట్రమంతా

భూ కబ్జాలకు నిలయం

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "చంద్రబాబుకు ప్రజలంటే పిచ్చి. ఎంతసేపు జనం జనం అంటూ జనం గురించే ఆలోచిస్తారు. మనం శాశ్వతం కాదు, మనం చేసిన పనులు శాశ్వతం. అందుకే ప్రజల కోసం పరితపిస్తారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ హైదరాబాదులో ఐటీ ఉద్యోగులు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చారు. మనం లేకపోయినా మనం చేసే మంచిపని మిగిలిపోతుందని చంద్రబాబునాయుడు చెప్పేవారు. ఇప్పుడు రాష్ట్రమంతా గంజాయి, లిక్కర్, భూకబ్జాలకు నిలయంగా మారిపోయింది. మీ పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా మీకు భవిష్యత్తు బాగుండాలన్నా టీడీపీని గెలిపించండి.. మీ ఓటే కాదు ప్రతి ఒక్కరూ పది ఓట్లు వేయించండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

భువనేశ్వరికి మహిళల స్వాగతం

గురువారం రాత్రి బద్వేలులోని మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు చెందిన కన్వెన్షన్ సెంటరులో నారా భువనేశ్వరి బసచేశారు. శుక్రవారం పలువురు టీడీపీ నేతలు ఆమెను కలిశారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం బి.కోడూరు మండలంలోని గుంతపల్లె నుంచి కలసపాడు మండలంలోని హృదయపేటకు పర్యటన మొదలైంది. మహిళలు భారీ స్వాగతం పలికారు. బి.కోడూరు, శంఖవరం, లింగారెడ్డిపల్లె, హృదయపేట, మామిళ్లపల్లె, మహానందిపల్లె, కలసపాడు, బ్రాహ్మణపల్లె, తెల్లపాడులలో భువనేశ్వరి కాన్వాయ్ ఆపి మరీ మహిళలు, యువకులు వచ్చి జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. అమ్మా మన ప్రభుత్వమే రావాలి, మేం ఎదురు చూస్తున్నాం, చంద్రబాబే సీఎం కావాలంటూ జనం భువనేశ్వరికి తెలిపారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం పరితపిస్తున్నారని, వచ్చే ఎన్నికలు చాలా కీలకమని టీడీపీని గెలిపించాలంటూ పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు.

కుటుంబాలకు పరామర్శ

చంద్రబాబు అక్రమ అరెస్టు తట్టుకోలేక మృతిచెందిన కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించారు. బి.కోడూరు మండలంలోని ముచ్చుమర్రికి చెందిన ఓబుల్‌రెడ్డి చంద్రబాబు అరెస్టుతో ఆవేదనకు గురై గతఏడాది సెప్టెంబరు 23న గుండెపోటుతో మృతిచెందారు. కలసపాడు మండలం లింగారెడ్డిపల్లెలోని హృదయపేటకు చెందిన డేవిడ్, బ్రాహ్మణపల్లెకు చెందిన వెంకటయ్య, తెల్లపాడుకు చెందిన చెంచిరెడ్డి గత ఏడాది సెప్టెంబరులో మృతిచెందారు. వీరి కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించారు. టీడీపీ కార్యకర్తలంతా తన బిడ్డలని ఎవరికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈమె వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఉన్నారు.

కార్యకర్తల్లో జోష్

నారా భువనేశ్వరి జిల్లా పర్యటన ఆ పార్టీకి ప్లస్‌గా మారింది. భువనేశ్వరి చాలా సాదాసీదాగా ఉండడంతో పాటు టీడీపీ కార్యకర్తలను నా బిడ్డలంటూ చెప్పడం, టీడీపీలో మంచి జోష్ నింపింది. నేను, నా కుటుంబం అని లేకుండా మనం, మన అనే దాన్ని జనాల్లో కేడరులో తీసుకువచ్చారు. ఆమె వెంట ఫ్లయింగ్‌స్క్వాడ్‌ను వైసీపీ నేతలు నిఘా పెట్టారు. అయితే ఎక్కడా కూడా ఈసీ నిబంధనలు ఉల్లంఘించలేదు. మాజీ మండలాధ్యక్షుడు దాదన భూపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాదనకారి రంతు, రామచంద్రారెడ్డి, రోశిరెడ్డి, మాబు తదితరులు పాల్గొన్నారు. పర్యటన అనంతరం ఆమె నెల్లూరు జిల్లాకు వెళ్లారు.



తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి



ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి



నల్లగుండ్ల వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యుల ఆవేదన వింటూ..



బసిరెడ్డి చెంచిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి

'రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు'

కడప(కలెక్టరేట్), మార్చి 22: పెళ్లిళ్లు, ఇల్లు కట్టేందుకు, పిల్లల విద్యకోసం, అప్పుల చెల్లింపులకు ఇతర వ్యవహారాలకు సంబంధించి పెద్ద మొత్తంలో నగదు తీసుకెళుతున్నారా? తస్మాత్ జాగ్రత్త. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతి వ్యక్తి రూ.50 వేలకు మించి నగదు తీసుకెళితే ఎన్నికల నియమావళి ప్రకారం సీజ్ చేస్తారు. ఇతర ప్రాంతాలకు రూ.50 వేలకు మించి తీసుకెళ్లాల్సి వస్తే తగిన ఆధారాలతో వెళ్లాలి. లేకపోతే నగదును ఎన్నికల సంఘం నియమించిన కమిటీ అధికారులు సీజ్ చేస్తారు. ఈ మేరకు కమిటీలో ఎన్నికల నోడల్ అధికారిగా జి.నాగరాజారావు (చేనేత), మెంబర్లుగా ఆనంద్ నాయక్ (డీఆర్డీఏ), ఎంఎస్ వెంకటేశ్వర్లు (జిల్లా ఖజానా శాఖ) అధికారులను నియమించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ప్రచారంలో వలంటీర్, ఫీల్డ్ అసిస్టెంట్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్, ఫీల్డ్ అసిస్టెంట్

పెండ్లిమర్రి, మార్చి 22: మండలంలోని తుమ్మలూరు పంచాయతీ గోపరాజుపల్లెలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె రమ్యత రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీర్ సుబ్బరాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ పాలగిరి శివారెడ్డి పాల్గొన్నారు. ప్రచారాల్లో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ పలుమార్లు చెప్పినప్పటికి వాటిని ఉల్లంఘించి పాల్గొనడం ఏమిటని స్థానిక టీడీపీ మండల కన్వీనర్ గంగిరెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓకు, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు గంగిరెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల సూచనలు

కట్టుదిట్టంగా అమలు చేయాలి

- 33 శాఖలతో పాటు మీడియాకు పోస్టల్ బ్యాలెట్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 22: భారత ఎన్నికల సంఘం సూచనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలుపై ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలన్నారు. జిల్లాలో 33 శాఖలకు చెందిన ఉద్యోగులతో పాటు ఎన్నికల విధులకు హాజరయ్యే మీడియా ప్రతినిధులకు కూడా పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సువిధ సేవలపై దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లను తొలగింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫాం-7, 8 లను ఈనెల 26 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు కౌసరు భానో, చంద్రమోహన్, మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, ప్రత్యూష, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, విజయకుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ

అడ్డగోలు నియామకాలు

- సబ్‌స్టేషన్లలో కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్ల భర్తీ
- నోటిఫికేషన్ లేకుండా రోస్టర్ పాటించకనే ఉత్తర్వులు
- ఒక్కో పోస్టుకు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూళ్లు
- అధికార పార్టీ ప్రజాప్రతినిధి అమ్ముకున్నట్లు ప్రచారం



ప్రొద్దుటూరు, మార్చి 22: సార్వత్రిక ఎన్నికలకు ముందు విద్యుత్ శాఖలోని సబ్‌స్టేషన్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులను ఆగమేఘాలమీద ఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులు నియామకాలు చేపట్టారు. ఈ నియమకాలకు ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ అమలుచేయకుండా ఇష్టానుసారం సందీప్ కన్‌స్ట్రక్షన్ అనే కాంట్రాక్టర్ ద్వారా ప్రొద్దుటూరులో 12 మందిని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించుకున్నారు. ఈ మేరకు మార్చి 10న ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసుల రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కో పోస్టుకు రూ.10-12 లక్షల వసూళ్లు

విద్యుత్ సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేయడానికి ఐటీఐ విద్యార్హత కలిగి అప్రెంటీస్ చేసిన వారు అర్హులు. కానీ ఈ నియామకాల్లో ఎటువంటి పరీక్ష నిర్వహించకుండా, దరఖాస్తులు ఆహ్వానించకుండానే కాంట్రాక్టర్ ద్వారా ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు అధికార పార్టీ పెద్ద వసూళ్లు చేసి వారిని ఎంపిక చేశారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల వేళ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు అది చేయకపోగా కాంట్రాక్ట్ ఉద్యోగాలకు కూడా దాదాపు కోటి రూపాయలకు పైగా వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

అప్రెంటీస్ చేసిన వారు లేకుంటే ప్రమాదాలు

సబ్‌స్టేషన్లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లుగా ఐటీఐ చేసి అప్రెంటీస్‌గా శిక్షణ పూర్తిచేసిన వారిని మాత్రమే నియమించాల్సి ఉంది. ఈ నియామకాల్లో అటువంటి అర్హత గల వారు లేరని యూనియన్ నేతలు ఆరోపిస్తున్నారు. సబ్‌స్టేషన్లో ఫీడర్‌కు బ్రేకర్ ఆన్ ఆఫ్ చేయాల్సి ఉంటుంది. ట్రిప్ అయినప్పుడు ఫీల్డ్‌లో ఉన్న లైన్ ఇన్‌స్పెక్టరుకు సమాచారం ఇచ్చి ఎక్కడ లైన్లో సమస్య వచ్చిందో పరిష్కరించాకే బ్రేకర్లు ఆన్ చేయాల్సి ఉంటుంది. ఈ అవగాహనతో పాటు సబ్‌స్టేషన్‌లోని పరికరాలపై, వాటి నియంత్రణపై పూర్తి పట్టు ఉండాలి. లేకుంటే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సబ్‌స్టేషన్‌లోని వారికి బదిలీ

ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని వెస్ట్ సబ్‌స్టేషన్, రూరల్ పరిధిలోని ఖాదరాబాద్ సబ్‌స్టేషన్లలో కొన్నేళ్లుగా షిఫ్ట్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్న లైన్‌మేన్‌లను ఫీల్డ్‌కు బదిలీ చేస్తూ డివిజన్ ఈఈ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో లైన్‌మేన్‌లు డివిజన్ కార్యాలయం వద్ద ఈ బదిలీలపై, షిఫ్ట్ ఆపరేటర్ల అక్రమ నియామకాలపై ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైకోర్టులో సైతం రిట్ దాఖలు చేశారు.

ఎటువంటి వసూళ్లకు పాల్పడలేదు

ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని మూడు సబ్‌స్టేషన్లలో 12 మంది షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేశాం. ఆ మేరకు అక్కడ పనిచేసే లైన్‌మేన్‌లను ఫీల్డ్‌కు బదిలీ చేశాం. ఆపరేటర్ల నియామకాల్లో ఎటువంటి వసూళ్లకు పాల్పడలేదు. ప్రస్తుతం వారు శిక్షణలో ఉన్నారు. శిక్షణ పూర్తి కాగానే సబ్‌స్టేషన్లలో నియమిస్తాం. ఆ పోస్టుల భర్తీ మా పరిధిలో జరగలేదు.

- శ్రీనివాసులరెడ్డి,
డివిజన్ ఈఈ,
ఎస్పీడీసీఎల్



డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లైన్‌మేన్‌లు (ఫైల్‌ఫోటో)

ఒంటరి మహిళలే టార్గెట్

- నగరంలో గొలుసు దొంగతనాలు
- ఈజీ మనీ కోసం పెడదారి పడుతున్న యువత
- కొరవడుతున్న పోలీసు నిఘా



కడప (క్రైం), మార్చి 22: ఈజీ మనీ కోసం కొంత మంది యువత పెడదారి పడుతున్నారు. పనిపాట లేకుండా జులాయిగా తిరిగే కొందరు జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారు. ముఖానికి హెల్మెట్, మాస్కులు పెట్టుకుని ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతు న్నా రు. మహిళల మెడల్లో ఉన్న బంగారు వస్తువుల్లో ఏది చేతికి దొరి కితే దాన్ని తెంపుకుని క్షణాల్లో మాయం అవుతున్నారు. ఆ సమయంలో మహిళలు కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి.

కడప నగరంలో ఇటీవల నాలుగు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. కడపతో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని ఈ గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. తలకు టోపీ లేదా హెల్మెట్ ధరించి ముఖానికి మాస్కులు పెట్టుకుని నెంబరు ప్లేటు లేని వాహనాల్లో వెళుతూ ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని.. జనాలు లేని నిర్మాణుష్య ప్రాంతాల్లో వారి మెడల్లోని గొలుసులను లాక్కెళుతున్నారు. ఆ సమయంలో మహి ళలు కింద పడి గాయాలపాలవుతన్నా పట్టించుకోకుండా చేతికి దొరికిన బంగారు గొలుసుతో ఉడాయిస్తున్నారు.

ప్రజల మధ్యనే తిరుగుతూనే...

నగరంలో చైన్‌స్నాచర్లు బరి తెగిస్తున్నారు. వీళ్ల సామాన్యుల్లాగా నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళల కదలికలను గమ నిస్తుంటారు. అదును చూసి బైకులో వచ్చి చిన్నపాటి కత్తెరతో చాలా సులభంగా గొలుసులు కత్తిరించి లాక్కెళుతున్నారు. ఈనేరాలకు పాల్ప డుతున్న వారంతా యువకులే అని తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై దాడులకు వెనుకాడడం లేదు. గొలుసులు తెంపే ప్రయత్నంలో మహిళలు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడుతున్నారు.

కొరవడుతున్న పోలీసు నిఘా

ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఐడీ పార్టీ పేరుతో కొంత మంది సిబ్బంది తిరుగుతుంటారు. కానీ దొంగలను గుర్తించడంలో వీరు పూర్తిగా విఫ లమవుతున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది కొరత, నగరంలో కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం తదితర సమస్యలతో నిందితులను గుర్తించలేకపోతున్నారు. గతంలో అయితే ఎవరు దొంగత నం చేసినా ఇట్టే తెలిసిపోయేది. ప్రస్తుతం దొంగలు అప్‌డేట్ కావడంతో ఎవరు స్నాచింగ్‌కు పాల్పడుతున్నారనేది తెలుసుకోవడం కష్టతరంగా మారింది. ఐడీ పార్టీ పోలీసులు కూడా పూర్తి స్థాయిలో నిఘా పెట్టకపోవడంతోనే వరుసగా గొలుసు చోరీలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో జన సమ్మర్ధం లేని ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్‌తో పాటు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప గొలుసు దొంగతనాలకు అడ్డుకట్ట పడే పరిస్థితుల కనిపించడంలేదు.

ఇటీవల జరిగిన గొలుసు దొంగతనాలు

- వారం రోజుల క్రితం కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఒంటరిగా నడచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇరువురు లాక్కెళ్లారు.
- ఈ ఏడాది జనవరి 19న లింగాలలో మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దొంగలు నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- ఫిబ్రవరి 16న కమలాపురంలో దొంగలు ఓ మహిళ నుంచి మూడు తులాల గొలుసు చోరీ చేశారు
- మార్చి 3న వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో హౌసిగ్‌బోర్డు కాలనీలో మహిళ వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు వాహనంలో వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- మార్చి 4న కడప ఎన్జీవో హోంలో నడుచుకుంటూ వెళుతున్న మహి ళ మెడలో నుంచి మూడుతులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. గతంలో తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో లగేజీ బ్యాగుతో వెళుతున్న మహి ళ వెనకనే వచ్చి చాకచక్యంగా ఆమె మెడలోని బంగారు గొలు సును అపహరించి పారిపోయారు. ఇలాంటి ఘటనలతో ఒంటరిగా వెళ్లే మహళలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూలు పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22: జిల్లాలో ప్రశాంతంగా ఏపీ సార్వత్రిక పరీక్షలు జరుగుతున్నాయని డీఈవో అనురాద తెలిపారు. శుక్రవారం ఆమె పరీక్షలను పరిశీలించారు. జిల్లాలో 13 కేంద్రాల్లో పదోతరగతికి సంబంధించి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలకు 2231 మందికి గాను 2002 మంది హాజరయ్యారని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 28 కేంద్రాల్లో 3735 మందికి 3514 మంది హాజరయ్యారని.. 221 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలను 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 41 కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి, డీఈవో పలు కేంద్రాలు పరిశీలించినట్లు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



పుట్టగొడుగుల పెంపకంపై వివరిస్తున్న శాస్త్రవేత్త

సీకేదిన్నె, మార్చి 22: పుట్టగొడుగుల పెంప కం లాభదాయకమని.. యువత దృష్టి సారించాలని శాస్త్రవేత్త సాయిమహేశ్వరి తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగులు మంచి పోషకాలు గల ఆహారమని.. పుట్టగొడుగుల పెంపకంపై దృష్టి సారించి యువత ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ రకాల పుట్టగొడుగుల తయారీ విధానం గురించి యువతకు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు

ఒంటిమిట్ట, మార్చి 22: కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పటిష బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం ఒంటిమిట్ట కోదండరామాలయ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కల్యాణోత్సవం రోజు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కల్యాణ వేదిక, కోదండరామాలయం పరిసర ప్రాంతం, కల్యాణం రోజు హైవేపై వెళ్లే వాహనాల దారి మళ్లింపు అంశాలను డీఎస్పీ షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుమోహన్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

కడప శ్రీనగర్ కాలనీలో చోరీ

- 9 తులాల బంగారు నగల అపహరణ

కడప (క్రైం), మార్చి 22: కడప నగరం శ్రీనగర్ కాలనీలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి నరసింహులు ఇంట్లో దొంగలు పడి తొమ్మిది తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న నరసింహులు బుధవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగల గొట్టినట్లు ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా ధ్వంసం చేసినట్లు గమనించారు. దీంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
గుజిరీ దుకాణంలో...: కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ గుజిరీ సామాన్లు విక్రయించే దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి క్యాష్ కౌంటర్‌లోని రూ.20వేల నగదు, సెల్ ఫోన్ అపహరించారు. దుకాణం యజమాని సల్మా తమకు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

జగనాసుర పాలన అంతానికే మూడు పార్టీల కూటమి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 22: పురాణాల్లో రాక్షసులను అంతం చేయ డానికి దేవతలంతా ఒక్కటైనట్లు రాష్ట్రంలో జగనాసుర పాలన అంతానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడప్పగారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరులో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించాడన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ముందుకు వెళుతుంటే రాష్ట్రం అన్ని విధాల వెనుకబడి అరాచకంలో ముందు ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొవ్వూరు బాలచంద్రా రెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్ల ప్రొద్దుటూరు రాజకీయ చరిత్రలో వరదరాజులరెడ్డి 25 ఏళ్లు వరుసగా ఎమ్మెల్యే అయినా ఏనాడు ఆయనను విమర్శించిన వాళ్ల మీద ప్రతిదాడి చేయలేదన్నారు. రాచమల్లు అరాచకపాలనను విమర్శించినందుకు, మున్సిపల్ స్కూలులో మార్కెట్ కట్టవద్దని పోరాడినందుకు 1.60 కోట్ల విలువైన నా సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే రాచమల్లు కక్షకట్టి మూయించి నన్ను తీవ్రంగా నష్టపరిచాడన్నారు. గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ 2019లో రాచమల్లు ఎన్నికల ముందు 30 కోట్ల అప్పులతో ఉన్నాడన్నారు. నేడు 1200 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించాడని రాష్ట్ర ఇంటలిజెన్సీ రిపోర్టు జగన్ దగ్గరే వుందన్నారు. రాచమల్లును మళ్లీ గెలిపిస్తే పెన్నానదిలో వున్న ఆ కొంత ఇసుక మిగలదన్నారు. ప్రభుత్వం భూములు ప్రైవేటు ఆస్తులు పూర్తిగా కబ్జా అవుతాయని విమర్శించారు. జనసేన రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యుడు జిలాన్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇంటింటికి వచ్చి మీకు పింఛన్లు, ఆసరా, విద్యా దీవెన, అమ్మవడి లాంటివన్నీ కలిపి లక్షలు నగదు ఇచ్చామని చెప్పి కార్డులు పంచుతున్నారన్నారు, కానీ జనాల నుంచి కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు, ఆర్టీసీ బస్సు చార్జీలు, పెట్రోల్, డీజల్ ధరలు పెంచి ఇంత దోచుకున్నామని ఎందుకు బ్రోచర్లు పంచరని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి మాట్లా డుతూ రాచమల్లు అరాచక పాలనను ప్రొద్దుటూరులో అంతం చేయడానికి బీజేపీ కూటమిలో క్రియా శీలకంగా పనిచే స్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికల పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, జనసేన నాయకుడు సుంకర మురళీ రామారావు, బీజేపీ నాయకులు బోగా శివకళ్యాణి, రాఘేవంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి చింతకుంట జయలక్ష్మి, టీడీపీ నాయకులు రాఘవరెడ్డి, కొండారెడ్డి, బచ్చల పుల్లయ్య తోట మహే శ్వరరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇంటర్ విద్యార్థి మృతి

ములకలచెరువు, మార్చి 22: వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి జశ్వంత్‌కుమార్(25) శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట పం చాయతీ బలకవారిపల్లెకు చెందిన జశ్వంత్‌కుమార్(25) ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో బురకాయలకోటకు బయలుదే రి వెళుతుండగా మార్గం మధ్యంలో బొలెరో వాహనం ఢీకొన డంతో తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. ఈ ప్రమా దంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని బెంగళూరులోని ఓ ప్రైవే టు ఆస్పత్రికిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రా మానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాన్ని నడప డంలో ప్రమాదానికి కారణమైందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

ఏడుగురుకి జైలు శిక్ష

బద్వేలు రూరల్, మార్చి 22: బద్వేలు కోర్టులో శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ ఏడుగురు నిందితులకు 3 నెలలు జైలు శిక్ష లేదా రూ.10వేలు జరిమానా విధించినట్లు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి చంద్ర తెలిపారు. 2008వ సంవత్సరంలో బ్రహ్మంగారిమఠం పోలీసు స్టేషన్ పరిధిలోని లింగాలదిన్నె గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘాతగా దాకు సంబంధించి కేసు నమోదైంది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాక్షుల తరుఫున వాదనలు వినిపించి నిందితులకు శిక్ష పడేలా చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌ల తొలగింపు



ఎమ్మెల్యే రాచమల్లుతో ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్, సేల్స్ మెన్‌లు

ప్రొద్దుటూరు, మార్చి 22: ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ నాగేష్, సేల్స్‌మెన్ ఓబులేసులను విధుల నుంచి తొలగిస్తూ ప్రొద్దుటూరు ఏపీఎస్‌బీసీఎల్ ఏఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో చేరిన వారు, ముఖ్యంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఒత్తిడి పెంచడంతో కొందరు విధిలేని పరిస్థితుల్లో పాల్గొంటున్నామని చెబుతున్నారు. దీంతో ఎన్నికల కమిషన్ మాత్రం ఎవ్వరైనా ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులతో పాటు పాల్గొంటే వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తున్నా రు. అయినా కొందరు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు, సీవోలు మద్యం దుకాణంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. వీరిపై ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిఘాపెట్టి కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగించటంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు.

ఎన్‌టీ పల్లె వలంటీరు తొలగింపు

నందలూరు, మార్చి 22: నల్లతిమ్మాయపల్లె గ్రామ వలంటీరు తుంటి యల్ల య్యను విధుల నుంచి తొలగిస్తూ ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆకేపాడు గ్రామంలోని ఆకేపాడు ఎస్టేట్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో ఫొటో దిగడంతో చర్యలు తీసుకున్నట్లు ఎంపీ డీవో తెలిపారు. వలంటీరు నుంచి సెల్‌ఫోను, బయోమెట్రిక్ డివైజ్‌లు, క్లస్టర్ రికార్డులను పంచాయతీ కార్యదర్శి స్వాధీనం చేసుకున్నారు.

సిద్దవటంలో...

సిద్దవటం, మార్చి 22: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని పాలకొండ్రాయునిపల్లె క్లస్టర్ వలంటీరు బత్తల సుధాకర్ విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలియజేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఈనెల 22న వడ్డేవారిపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఆయన తెలియజేశారు.

ఎంపీటీసీపై కేసు

చాపాడు, మార్చి 22: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు చెమికల రమాదేవి ఆమె భర్త మాధవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకరయ్య తెలిపారు. వీరిద్దరు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శుక్రవారం ఆ గ్రామంలో కొత్తగా శ్రీరాముల దేవాలయం నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సీజీఎస్ గ్రాంట్ కింద దేవాదాయ శాఖకు సంబంధించి రూ.10 లక్షలు ఈ దేవాలయ నిర్మాణానికి మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి భూమి పూజలో పాల్గొన్నారు. ఎంపీడీవో మహబూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



ఒంటిమిట్ట, మార్చి 22: ఒంటిమిట్ట మెయిన్ బజార్‌కు చెందిన కట్టా సుబ్బలక్ష్మి (57) అనే మహిళ గురువారం రాత్రి నుంచి కనబడటం లేదని వారి కుమారులు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని, ఎవరికైనా సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

మెడికల్ రెప్రజెంటేటివ్ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, మార్చి 22: మదనపల్లె మండలం రామాచార్లపల్లెలో నివాసమున్న దశరథశెట్టి కుమారుడు, మెడికల్ రెప్రజెంటేటివ్ అమరనాథ్(30) గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూతలపట్టు మండలానికి చెందిన అమరనాథ్, శోభారాణి దంపతులు నాలుగేళ్లుగా రామాచార్లపల్లెలో నివాసముంటున్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న అమరనాథ్ ఇటీవల ఆర్థిక కారణాలు, మానసిక ఒత్తిడితో మనస్తాపం చెందేవాడు. దీంతో అతని ఇంట్లోనే ఫ్యాన్ కొక్కికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ స్టోర్‌పై దాడులు.. మందులు సీజ్



మెడికల్ స్టోర్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చక్రాయపేట, మార్చి 22: మండలంలోని నాగులగుట్టపల్లెలో విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌పై శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసూంబాష ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఎస్పీ నాగరాజారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి మెడికల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ స్టోర్‌లో 35 రకాల మందులు (అమ్మకూడనివి) అమ్ముతున్నారని, అలాగే పశువులకు సంబంధించిన మందులు ఉండటం వల్ల సీజ్ చేసినట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి తెలిపారు. అలాగే మెడికల్ స్టోర్ వెనుక వైపు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రెడ్డప్ప, అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఆఫీసర్ బాలగంగాధర్‌రెడ్డి, డీఎస్‌పీఓ డాక్టర్ వెంకటచంద్రారెడ్డి, రాయచోటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి రేపు ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్), మార్చి 22: తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ కోసం ఆదివారం జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. **బస్సుల వివరాలిలా..**

- కడప డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు (6002) ఉదయం 5 గంటలకు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా వెళుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1,072
- బద్వేల్ డిపో నుంచి రెండు బస్సులు (9569, 60009) ఉదయం 7 గంటలకు బయలుదేరతాయి. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా ఒక బస్సు. మరో బస్సు పెంచలకోన, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళతాయి. ఇందులో చార్జి రూ.1,566, రూ.1,475
- మైదుకూరు డిపోకు చెందిన రెండు సూపర్ లగ్జరీ బస్సులు (97876, 95678) పోరుమామిళ్ల నుంచి బయలుదేరుతాయి. ఒకటి ఉదయం 6 గంటలకు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా... మరో బస్సు సాయంత్రం 6 గంటలకు బయలుదేరి కడప మీదుగా వెళుతుంది. ఇందులో చార్జి రూ.1,414, రూ.1,214
- ప్రొద్దుటూరు డిపో నుంచి బస్సు (9944) మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు కడప మీదుగా వెళుతుంది. ఇందులో చార్జి రూ.1,273
- జమ్మలమడుగు నుంచి సూపర్ లగ్జరీ బస్సు (98398ఎ) రాత్రి 8 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుంది. చార్జీ రూ.1,352
- పులివెందుల డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు (59900) ఉదయం 7 గంటలకు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుతుంది. ఇందులో టికెట్ రూ.1,242.

ఉద్యోగాల పేరుతో మోసం...పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె, మార్చి 22: బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ మహిళ మోసం చేసిందని బాధితు లు పోలీసులను ఆశ్రయించారు. నిమ్మనపల్లె మండలం అగ్రహా రం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన ఎం.నందిని..తమను మోసం చేసిందని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. నిమ్మనపల్లె, మదనపల్లె, కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు ప్రాంతాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువతుల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, ఎడ్యుకేషన్ రికార్డులు తీసుకుందని, శిక్షణ పేరుతో కర్ణాటక ప్రాంతం రాయల్పాడుకు రెండుసార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక.. మదనపల్లె, రాయల్పాడు ఏరియాలలో కార్యాలయం ఏర్పాటు చేసి ఉపాధి మార్గాలను చూపిస్తామని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. ఇందుకోసం తమ వద్ద రూ.10వేల నుంచి రూ.20వేలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంతకాలం శిక్షణ, కార్యాలయం ప్రారంభం పేరుతో కాలయాపన చేసిన నిందితురాలు..తాము నిలదీస్తే..సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోందని విచారించి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరుతున్నారు.

అయితే..నిందితురాలు తమ పరిధిలో లేదని, బాధితులు తమ ఏరియాకు రారని రాయల్పాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లండని పోలీసులు సూచించినట్లు బాధితులు చెబుతున్నారు. ఇదిలా వుండగా, నిమ్మనపల్లె మండలానికి చెందిన నందినికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న ఆమె ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నట్లు చెబుతూ.. అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువతుల వద్ద డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. ఆమె పనిచేస్తున్న కంపెనీలో మేనేజర్‌గా, సీని యర్ డైరెక్టర్‌గా ఉన్నట్లు విజిటింగ్ కార్డులతో ప్రచారం చేసిన ట్లు బాధితులు పేర్కొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22 : ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అర్హులైన ప్రతి విద్యార్థి తమ ఓటు నమోదు చేసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి సూచనల మేరకు అర్హులైనవారికి ఉచిత ఓటు నమోదు కార్యక్రమం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్నామ న్నా రు. కావున అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

నేడు వైవీయూ వ్యవస్థాపక దినోత్సవం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22 : వైవీయూ 18వ వ్యవస్థాపక దినోత్సవం ఈ నెల 23న క్యాంపస్‌లోని ఏపీజే అబ్దుల్ కలాంసెంట్రల్ లైబ్రరీ భవన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తెలిపారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అధ్యక్షతన వహించనుండగా తిరుపతి ఎస్వీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు వి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ఆంజనేయ ప్రసాద్ హాజరవుతున్నారన్నారు. న్యూఢిల్లీ ఎస్ఆర్‌పి ఫౌండేషన్ డైరెక్టరు సు రేష్‌రెడ్డి ఈ వేడుకలకు హాజరవుతారని వివరించారు.

పనివేళల్లో మార్పులు తీసుకురావాలి

కడప (నాగరాజుపేట), మార్చి 22 : ప్రస్తుత రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయని వడగాల్పులు కూడా సోకుతున్నాయని దీన్ని దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణ కార్మికులు ఎండలో పనిచేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మికశాఖ సహాయక కమిషనరు బి.శ్రీకాంత్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మండుతు న్న ఎండలతో ప్రజలు కూలీలు, పిల్లలు, ముసలివారు ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా కార్మికు లు పనివేళల్లో మార్పులు తీసుకురావాలన్నారు. ఉ దయం 10 గంటల్లోపు, సాయంత్రం 4గంటల పైన వారి పనులు చేసుకోవాలన్నారు. అలాగే బిల్డింగు యజమానులు కూడా తమ కన్ స్ట్రక్షన్ పనులు చేయించుకునే కార్మికుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జగదీష్, నాగరాజు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22:ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కర్యాదర్శులుగా నాగిపోగు జగదీష్, కె.నాగరాజు ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పే ర్కొ న్నారు. జిల్లాలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో వచ్చే సమస్యలపై పోరాటం చేసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.

ఇఫ్తార్‌విందులో శ్రీనివాసరెడ్డి



ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాసరెడ్డి, ముస్లిం సోదరులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22 : కడప నగరం 28వ డివిజన్ ఎస్కే బాషా ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు. జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివకొండారెడ్డి, జిలానీ, మన్సూర్, జియావుద్దీన్, మహ్మద్, ఖాజాపీర్, షబ్బీర్, డాక్టర్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమీర్‌బాబు

కడప నగరం ఫాతిమా మెడికల్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు పాల్గొన్నారు. ఆలీఖాన్, అష్రఫ్, రెహ్మాన్, ఇమ్రాన్, నాసర్ ఆలీ, రఫిక్‌ఖాన్, మేకల వెంకటేశ్‌యాదవ్, ఇలియాస్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సమగ్రాభివృద్ధి: టీడీపీ



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె, మార్చి 22: మండలంలోని అనిమెల గ్రామంలో శుక్రవారం వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సంగమేశ్వర మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీలో చేరారు. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు రాంబాబు, మల్లికార్జునరెడ్డి, సిరిగేపల్లె బ్రహ్మయ్య, నల్లబల్లె శివ, వెంకటరమణ, నాగేష్, ఆనంద్, సురేష్, బ్రహ్మయ్యలతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పుత్తా నరసింహారెడ్డి తనయుడు కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గండి ఓబయ్య, తలపనూరు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేయండి: పుత్తా చైతన్యరెడ్డి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పుత్తా చైతన్యరెడ్డి

చెన్నూరు, మార్చి 22 : రాష్ట్రంలో అవినీతికి అరాచకాలకు కేంద్ర బిందువుగా మారి ప్రజలను అష్టకష్టాలు పాలు చేసిన వైసీపీ పాలనను అంతం చేసి టీడీపీని గెలిపించాలని టీడీపీ యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచా యతీలో శుక్రవారం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, యువనేత జి.రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నరసారెడ్డిపల్లె, దుగ్గనపల్లె, ఉప్పరపల్లె గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైసీపీ అరాచకాలను వివరించారు. టీడీపీని గెలిపిస్తే అందించే పథకాల గురించి వివరించారు. నరసారెడ్డిపల్లె సీనియర్ టీడీపీ నేతలు వీరభద్రరెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డి.సుబ్బారెడ్డి, దుగ్గనపల్లె నేతలు దామోదర్, కల్లూరి వెంకటసుబ్బయ్య, కల్లూరి మురళి, ప్రవీన్, ఉప్పరపల్లె సీనియర్ నేతలు ఆవుల్ శంకర్‌రెడ్డి , గుణ, కేసువెంకటసుబ్బారెడ్డి, అనిల్‌యాదవ్, మాజీ సర్పంచ్ జయన్న, శ్రీనివాసులరెడ్డి, సుధాకర్రెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవ భయహరం.. శ్రీనృసింహం



సామూహిక పారాయణం నిర్వహిస్తున్న పండితులు

వల్లూరు, మార్చి 22 : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లె గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మినరసింహస్వామి 28వ వార్షికోత్సవంలో భాగంగా రెండోరోజు శుక్రవారం ఉదయాన్నే లక్ష్మినరసింహస్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశ స్థాపన గావించి అగ్ని ప్రతిష్ఠ స్థాపనను వేదపండితులు ఆలయ ధర్మకర్త పుత్తా నరసింహారెడ్డి ధర్మపత్ని సరళమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వాసుదేవ ద్వార సాక్షార ఆయుధ హోమాన్ని నిర్వహించిన అనంతరం నృసింహ మూలమంత్ర గాయత్రి అనుష్ఠాన హోమం నిర్వహించారు. శ్రీ సూక్త విధానాలతో హోమాలు నిర్వహించిన అనంతరం లఘు పూర్ణహుతి చేశారు. సాయంత్రం వేళ సామూహిక విష్ణు సహస్ర పారాయణం చేపట్టిన అనంతరం చతుష్ట నారార్చనగావించారు. అనంతరం అష్టోత్తర శత పురుష సూక్తం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ లక్ష్మి నరసింహస్వామితో పాటు నవగ్రహ అధిదేవతలకలిసి రుద్ర సహిత హోమాలు చేశారు. సాయంత్రం నరసింహస్వామికి మంగళహారతి అందించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే నేడు శనివారం ప్రాతఃకాలం జపం, హోమాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం లక్ష్మిసహస్రనామ కుంకుమార్చన ఉంటుందని ఆలయ ధర్మకర్త పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. రాత్రి 9గంటలకు రంగస్థల పద్యాల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామని, పాల్గొనదలచిన వారు దేవాలయ కమిటీ నందు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పుత్తా చైతన్యరెడ్డి సతీమణి చైతన్య, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి భార్య వెంకటసుబ్బమ్మ, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టడం మనందరి బాధ్యత





ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పులివెందులలో ప్రతిజ్ఞ చేస్తున్న డీన్, అధ్యాపకులు, విద్యార్థులు... వేంపల్లెలో విద్యార్థుల ప్రతిజ్ఞ

పులివెందుల రూరల్, మార్చి 22: రోజురోజుకు పెరుగుతున్న భూతాపం, వ్యర్థాల వల్ల కలిగే కాలుష్యం వలన భవిష్యత్‌లో మంచినీటి శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని, ఇప్పటి నుంచే నీటి వృథాను అరికట్టే బాధ్యత తీసుకుందామని పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. నీటి వృథాను అరికట్టడం, నీటి సంరక్షణ స్త్రీల పాత్ర తదితర నీటి అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా డీన్ వివరించారు. అనంతరం నీటి సంరక్షణ గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ రాజేష్, అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజశేఖర్, ఎన్.వీ. సుబ్బారెడ్డి, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ ప్రగతి, జీవనానికి ఆధారం జలం

వేంపల్లె, మార్చి 22: సమస్త జీవకోటికి ప్రాణాధారం జలం అని, సమస్త జీవకోటి మనుగడకు జలం ప్రాముఖ్యమని, జల వనరులను సంరక్షించుకుంటూ వ్యర్థంగా వినియోగించకుండా భావితరాలకు మార్గదర్శకులు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ప్రపంచ జల దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు షఫీ ఉద్దీన్, రాజారెడ్డి, పీడి తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఏపీపీటీడీ కార్మికపరిషత్ రీజనల్ కమిటీ రద్దు అవాస్తవం'

కడప (మారుతీనగర్), మార్చి 22: ఆంధ్రప్రదేశ్ ప్రజా ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ కార్మికపరిషత్ అసోసియేషన్ రీజనల్ కమిటీ రద్దు ప్రకటన అవాస్తవమని ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యార్లగడ్డ రమేష్ పేర్కొన్నారు. రీజనల్ కమిటీని రద్దుచేసే అధికారం కేవలం కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకే ఉంటుందన్నారు. అంతేగాని ఇతరులకు ఉండదని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం తమ కార్మిక పరిషత్ అసోసియేషన్ అలుపెరుగని పోరాటం సాగిస్తోందన్నారు. కాగా ఇటీవల రీజనల్ కమిటీని రద్దు పరచినట్లుగా ఏబీజీ రెడ్డి ఓ ప్రకటన ఇవ్వడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాగా రీజనల్ కార్మిక పరిషత్ అడహక్ కమిటీని ఏర్పాటు చేసినా అది చెల్లదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి దుందుడుకు ప్రకటనలకు స్వస్తి పలికి ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

డీజీపీ, చీఫ్ సెక్రటరీలను ఎన్నికల విధుల నుంచి తొలగించాలి

● చీఫ్ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నేత గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22 : రాష్ట్రంలో డీజీపీ చీఫ్ సెక్రటరీలను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి డిమాండ్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుప్పిట్లో పోలీసు, రెవెన్యూ వ్యవస్థలు ఉన్నాయని, ఎన్నికలు సజావుగా జరగాలంటే వారిని పక్కనబెట్టాలని చెప్పారు. శుక్రవారం కడప నగరం ద్వారకనగర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌కు డీజీపీ, చీఫ్ సెక్రటరీపై మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. డీజీపీ, చీఫ్ సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురూ కడప జిల్లాకు చెందినవారేనన్నారు. డీజీపీ, చీఫ్ సెక్రటరీలు ముఖ్యమంత్రి చెప్పుచేతుల్లో ఉంచుకుని ఎన్నికలు జరుపుకోవాలని చూస్తున్నారన్నారు. డాక్టర్ సుధాకర్‌ను మాస్కు అడిగినందుకు పోలీసులు ఆయన మరణించేంత వరకు వేధించారని తెలిపారు. అలాగే వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ఎస్సీ వ్యక్తిని చంపి డోరు డెలివరీ చేసిన విషయం గుర్తు చేశారు. అంగళ్లు వద్ద వైసీపీ కవ్వింపుల్లో 600 మంది టీడీపీ నాయకులు కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని చెప్పారు. అలాగే నం ద్యాల, గిద్దలూ రులో వైసీపీ గుండాలు బరి తెగించారన్నారు. మొన్న చిలకలూరి పేటలో జరిగిన సమావేశంలో ప్రధాని నరేంద్రమోడీ బహిరంగసభలో భద్రత కల్పించడంలోపోలీసు వ్యవస్థ వైఫల్యం చెందిందన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో లా అండ్ ఆర్డరు ఎలా ఉందో ప్రజలందరికీ అర్థమైందన్నారు. మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి అభ్యర్థులను బలవంతంగా నామినేన్లు ఉపసంహరింపజేసి ఏకగ్రీవం చేసుకున్నారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలంటే ఎన్నికల కమిషన్ డీజీపీని చీఫ్ సెక్రటరీలను ఎన్నికల విధుల నుంచి తొలగించాలన్నారు. వారి స్థానాల్లో ఇతర రాష్ట్ర అధికారులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుగంటి పీరయ్య, చెప్పలి జనార్ధన్, బొజ్జ తిరుమలేశ్ పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డిని ఇడుపులపాయకు సాగనంపుదాం'

కడప (మారుతీనగర్), మార్చి 22: దళితుల అభివృద్ధి, సంక్షేమాన్ని అటకెక్కించి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించి ఇడుపులపాయకు సాగనంపుదామని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.రాజా పిలుపునిచ్చారు. పేరుకేమో మూడు ఎస్సీ కార్పొరేషన్‌లు అంటూ ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లను కూడా నియమించినప్పటికీ వాటిల్లో ఏ ఒక్క కార్పొరేషన్‌లో కూడా నిధులు లేకుండా చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శుక్రవారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్దగల దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వచ్చే ఏప్రిల్ 3న కడపలో జరుపతలపెట్టిన రాజకీయ చైతన్యవేదిక కార్యక్రమానికి చెందిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. సుబ్బారావు, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, అధికార ప్రతినిధి కె. వెంకటేష్, నగర అధ్యక్షుడు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలు జరగాలి: కమిషనర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22 :కడప నగరపాలక సంస్థ పరిధిలో వంద శాతం పన్ను వసూళ్లు జరగాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలో 29వ డివిజన్‌లో సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివలయప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు వారి వాహనాల్లో పార్కింగ్ చేసుకునేందుకు బారికేడ్లు ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని ఆదేశించారు.

'ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి'



వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల్లో పాల్గనే ఎన్నికల సిబ్బందికి తగి న సౌకర్యాలు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించు ఉద్యోగ ఉపాధ్యాయులకు తగిన మినహాయింపులను సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 58 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలన్నారు. కేడరు, సీనియారిటీ ప్రాతిపదికన విధులు కేటాయించాలని మహిళా ఉద్యోగ ఉపాధ్యాయులకు వారు పనిచేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే పట్టణ కేంద్రాల్లో ఎన్నికల విధులను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గోపినాథ్, చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులు

కడప (క్రైం), మార్చి 22 : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఇద్దరు సివిల్, ఎస్ఈబీ, ఏఆర్ విభాగాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. కొండాపురం పోలీసుస్టేషన్ పరిధిలో ముచ్చుమర్రి క్రాస్ వద్ద వాహన తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకోవడం కృషి చేసిన కానిస్టేబుల్ డి.నరసింహులు, మద్దిలేటిలను ఎస్పీ అభినందించారు. అలాగే యాంటి రయట్ డ్రిల్‌ను తర్ఫీదు ఇవ్వడంలో కీలక పాత్ర వహిస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ చిట్టిబాబు, ఇటీవల బద్వేలులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనపరచడంలో కృషి చేసిన ఎన్‌ఫోర్స్‌మెంటు కానిస్టేబుల్ ఎం.గురుప్రసాద్‌లను ఎస్పీ సిద్దార్థ కౌశల్ అభినందించి వారికి ప్రశంసాత్రం, నగదు రివార్డులు అందించారు. ముస్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరొద్దు: ఎస్ఎఫ్ఐ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22 : కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ తెలిపారు. శుక్రవారం కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలు ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరి మార్కులు, ర్యాంకులు కోసం విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. లక్షల రూపాయలు ఫీజులు వసూ లు చేస్తూ మార్కులు ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా వేధిస్తూన్నాయని అలాంటి విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్పించవద్దని కోరారు. ప్రభుత్వవిద్యాసంస్థల్లో క్వాలిఫైడ్ అధ్యాపకులు ఉంటారని, నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

బోలేవార్డు పనులతో వ్యాపారులకు తీవ్ర ఇబ్బంది



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 22: బోలేవార్డు పనులతో వ్యాపారులందరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నందున వారిపై ప్రేమ ఉన్నట్లుగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం అంటూ మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ పరిపాలన విభాగంలో గాని, నామినేటెడ్ పదవుల్లో గాని, స్వర్ణకారులకు గాని ప్రాతినిధ్యం కల్పించకపోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆర్యవైశ్యులకు అండగా ఉంటామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ ధనుంజయుడు

వేముల, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలు ఎవరైన ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ధనుంజయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీల వారు ప్రచారం చేయాలన్న, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా ఇతర రాజకీయ కార్యకలాపాలు నిర్వహించాలన్న ముందుగా సంబంధిత అధికారుల వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా గ్రూప్ అడ్మిల్ వారు గ్రూపులలో రాజకీయ పార్టీలకు సంబంధించి విమర్శించడం, రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, షేర్ చేయడం నిషేధమని ఈ సందర్భంగా హెచ్చరించారు.

బాసట చిల్డ్రన్స్ హోంకు రిఫ్రిజిరేటర్, దుస్తులు వితరణ



బాసట చిల్డ్రన్స్ హోంలో ఎల్ఐసీ ఉద్యోగులు

కడప (నాగరాజుపేట), మార్చి 22 : కడప నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోంకు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మహిళా సబ్ కమిటీ ఉద్యోగులు శుక్రవారం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ. 30వేలు విలువ గల రిఫ్రిజిరేటర్‌తో పాటు 11 మంది విద్యార్థులకు దుస్తులు అందించారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం శ్రామిక మహిళా కన్వీనరు పర్వీన్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఒక సామాజిక బాధ్యతగా అందించిన విరాళాలతో వితరణ చేసినట్లు తెలిపారు. ఇంకా మరికొందరు దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు తమ చేతనైంత సాయం అందిస్తే బాగుంటుందని అన్నారు. మహిళా సబ్ కమిటి సభ్యులు శ్రావణి, పద్మజ, లత, లీల, లక్ష్మి యూనియన్ నాయకులు రాజు, దైవారెడ్డికుమార్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవ్య మృతికి కారణమైన కరస్పాండెంట్‌ను అరెస్టు చేయాలి

● విద్యార్థి, యువజన సంఘాల నాయకులు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 22 : ప్రొద్దుటూరు గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీరింగట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని నవ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని, దీనికి కారణమైన కరస్పాండెంట్‌ను అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు జయవర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నవ్య మృతి పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించి విచారణ జరిపి కరస్పాండెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కలెక్టరు స్పందించి కళాశాల గుర్తింపు రద్దుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, నిరంజన్, గౌస్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో జాగ్రత్తలు తీసుకోండి

● రైతులకు ఉద్యానవన శాస్త్రవేత్త మానస సూచన

చెన్నూరు, మార్చి 22 : మండలంలో పండ్లతోటలు సాగు చేసే రైతులు ప్రస్తుత సీజన్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కడప కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా క్టర్ మానస అన్నారు. మం డలంలోని కొండపేట గ్రా మంలో కాయలతో ఉన్న చీనీ తోటలను పరిశీలించా రు. అక్కడి రైతులకు పండ్ల తోటలకు వచ్చే బంక తె గు ళ్లు, వేరుకుళ్లు తెగులు, మం గునల్లి గురించి తెలిపారు.

ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఏ పంటకైనా నీటిపారుదల యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే చాలా వరకు పండ్లతోటల్లో సమస్యలు లేకుండా చేయవచ్చన్నారు. సూక్ష్మధాతు లోపాలను సవరించి సరిచేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారిణి శ్రీదేవి, ఉద్యానవన శాఖాధికారి జ్యోతిర్మయి, వీపీఏ రఫి పాల్గొన్నారు.

నీటిని వృథా చేయకుండా కాపాడదాం

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22 : నీటిని వృథా చేయకుండా కాపాడాలని ఎన్ఎస్ఎస్ పీఓ షకీలాబేగం తెలిపారు. కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలో శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చెట్ల పెంపకం, నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను కాపాడినట్లయితే మనిషికి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన చేస్తూ సిమెంటు రోడ్డు నిర్మాణం



జమ్మలమడుగు, మార్చి 22: జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామం ఎస్సీ కాలనీలో శుక్రవారం ఉదయం నుంచి సిమెంటు రోడ్డు పనులు చేపట్టారు. నాలుగు సంవత్సరాల నుంచి వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ ప్రాంతవాసులు గతంలో సిమెంటు రోడ్డు వేయాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, ఇన్ని సంవత్సరాల నుంచి లేని సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టడానికి కోడ్ ఉల్లంఘన చేయడమేనని ఆరోపిస్తున్నారు. ఉన్నట్లుండి చకచకా రోడ్డు పనులు చేపట్టడంతో స్థానికులు అవాక్కయ్యారు. జమ్మలమడుగు ఎంపీడీవో ముజఫర్‌ను 'ఆంధ్రజ్యోతి' రోడ్డు సమస్యకు సంబంధించి వివరణ కోరగా సిమెంటు రోడ్డు నిర్మాణం చేస్తున్న విషయం తనకు తెలియదని, తమ సిబ్బందిని పంపించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కేసీ పుల్లయ్య ఫౌండేషన్ అధ్యక్షురాలు క్రిష్ణవేణమ్మ, కార్యదర్శి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కేసీ పుల్లయ్య వర్ధంతి సందర్భంగా కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణాకు చెందిన వేలు ఆనందాచారికి కళారత్న అవార్డు, ఉత్తరాఖండ్‌కు చెందిన పద్మశ్రీ బసంతీదేవికి హరితరత్న అవార్డు, రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ కృతి భర్తీకి సేవా రత్న అవార్డు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ శెటెం అంజనేయులుకు విద్యారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి అశోక్‌కుమార్ , టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరి మారుతీప్రసాద్ , డాక్టర్ చంద్రశేఖర్, కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సీఈవో పల్లా సుధ, సుశీల్‌కుమార్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం



మొక్కుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్

జమ్మలమడుగు, మార్చి 22: జమ్మలమడుగులోని పలగాడివీధిలో వెలసిన హజరత్ సయ్యద్ షా రఫివుల్లాషాఖాద్రీ స్వామివారి 616వ ఉరుసు మహోత్సవం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ప్రొద్దుటూరు, ముద్దనూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి స్వామివారి దర్గాలో దర్శించుకున్నారు. భక్తులు విశేషంగా పాల్గొని దర్గాలో పూల చాదర్లు అలంకరించి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి





కలసపాడులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి,బీ.కోడూరులో మాట్లాడుతున్న భువనేశ్వరి

కలసపాడు, మార్చి 22 : ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధి చెప్పి అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లగుంటపల్లెలో గ్రామంలోని సగిలి డేవిడ్ కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రబాబు అరెస్టు అయినప్పుడు వత్తిడి తాళలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి వారికి తమ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఈ వైసీపీ పాలనలో అరాచకం ఎక్కువైందన్నారు. భూకబ్జాలు, లిక్కర్ మాఫియా ఎక్కువైందని మహిళలకు రక్షణ కరువైందన్నారు. విశాఖలో ఇటీవల గంజాయి పట్టుబడిందని, యువతను మత్తు పానీయాలకు దగ్గర చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. ప్రజలు ఇవన్నీ ఆలోచించి వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు.

చంద్రబాబును గెలిపించండి

బి.కోడూరు, మార్చి 22 చంద్రబాబుకు ఓటు వేసి సీఎంను చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నారా భువనేశ్వరి అన్నారు. శుక్రవారం నిజం గెలవాలి యాత్రలో భాగంగా బి.కోడూరు మండలం గుంతపల్లె గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు జరిగిన రోజుతట్టుకోలేక గుండెపోటుతో గవిరెడ్డి ఓబుల్‌రెడ్డి మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మృతుని భార్య నారాయణమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారి ఆర్థిక సాయం అందించారు. అనంతరం అగ్రిగోల్డ్ బాధితులు ఆమెను కలిసి వినతిపత్రం అందించి ప్రభుత్వం వచ్చిన వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌రెడ్డి సతీమణి కైవల్యరెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పలూరు రామసుబ్బారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలయ్య, పవన్, కేశవ, నరసింహారెడ్డి, బాలిరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

పుట్టా సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక



మైదుకూరులో టీడీపీలో చేరిన యువకులతో పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ మార్చి 22 : మా మొదటి ఓటును మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌కు వేసి గెలిపించుకొంటామని మైదుకూరులోని మణి,కిరణ్,యూసూఫ్,జయప్రకాష్,సాయి తది తరులు తెలిపారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మైదుకూరు పట్టణానికి చెందిన 50 మంది యువకులు పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించుకొంటామని పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో పట్టణ యువత సునీల్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని అంజనేయ కొట్టాలుకు చెందిన వైసీపీ నాయకులు ఆవుల పాపయ్య, రవికుమార్, హుస్సేన్‌పీరా, ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డి అనుచరవర్గం మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని, చంద్రబాబు గెలుపే ధ్యేయంగా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, పాపిరెడ్డి, శివకుమార్, గణేష్, గురప్ప, నాగరాజు, ఈశ్వరయ్య, గంగరాజు, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పుట్టాను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం'

మైదుకూరు మార్చి 22 : మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌కు మద్దతుగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని మైదు కూరు బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు తెలిపారు. వనిపెంట రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక సమావేశంలో మైదుకూరు టీడీపీ,జనసేన,బీజేపీ ఇన్‌చార్జీలు సుధాకర్‌యాదవ్,పందిటి మల్హోత్ర, మాచనూరు సుబ్బరాయుడు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రానున్న ఎన్నికల్లో పుట్టా గెలుపొందేందుకు ప్రణాళిక రచించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన పుట్టా

బ్రహ్మంగారిమఠం, మార్చి 22 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో తిప్పన వారి వివాహానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరై నూతన వధూవరులు తిప్పన సురేష్‌కుమార్, వధువు సంధ్యారాణిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, మోపూరి రమణ, మేకల రమణయ్య, జయరాంనాయుడు, వినోద్, శ్రీను, పూజా శివయ్యయాదవ్, నాగయ్య, ధర్మ, బీటీఎస్ రెడి పాల్గొన్నారు.

గండికోట నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలి

కొండాపురం, మార్చి22: గండికోట నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదేళ్లు కావస్తున్నా పరిహారం చెల్లించలేదన్నారు. మొదటివిడత ముంపునకు గురైన 14 గ్రామాలకు వెంటనే అదనపు పరిహారం క్రింద రూ.3,25,000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కొండాపురం సప్లైమెంటరీ జాబితా నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారాన్ని చెల్లించాలని కోరారు. పి.అనంతపురం,సుగుమంచిపల్లె, చిన్నపల్లె గ్రామాలకు పునరావాసం కల్పించటం,పరిహారం చెల్లించని అన్ని గ్రామాలకు ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు జయంతు,ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బరావు ,డాక్టర్ ప్రభాకర్‌రావు,బాషాపాల్గొన్నారు.

బీరుసీసాలు స్వాధీనం

కొండాపురం,మార్చి 22: మండలంలోని లావనూరు గ్రామంలో 15 బీరు బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.లావనూరు గ్రామానికి చెందిన వరదరాజులరెడ్డి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

నాడు నేడు పనుల్లో నిర్లక్ష్యం

పోరుమామిళ్ల, మార్చి 22 : నాడు నేడు పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలోని ఇందిరానగర్‌లో ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశామన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి రూ.16లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తే ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా 50 మూటల సిమెంటు బస్తాలు గడ్డకట్టి పనికి రాకుండాపోయాయన్నారు. వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కోటపోలేరమ్మ తిరుణాల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కోట పోలేరమ్మ

పోరుమామిళ్ల, మార్చి 22 : మండలంలోని రంపాడు వీధిలో వెలసిన కోటపోలేరమ్మ దేవాలయంలో శుక్రవారం తిరుణాల వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు చల్లన్నం తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు.

నేటి నుంచి అంకాలమ్మ తల్లి తిరుణాల

బి.కోడూరు, మార్చి 22 : మండల పరిధిలోని మున్నెల్లి గ్రామం, సగిలేటి వద్దున వెలసిన పురాతన అంకాలమ్మ తల్లి తిరుణాల శనివారం నుంచి ప్రారంభమై 27వ తేదీన బుధవారం ముగుస్తుంది. 23 శనివారం అభిషేకం, ఆకుపూజ, 24న ఆదివారం ధ్వజారోహణ, 25న సోమవారం రాత్రి తిరుణాల ఘనంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చలిపిండి, నాన పాలు, కులుకు పండరి భజనలు, భరత నాట్యం, పాటకచ్చేరినూనె డబ్బాలు, కోలాటాలతో ప్రజలు విరివిగా పాల్గొంటారు. 26న మంగళవారం పగలు తిరుణాల రోజున బి.మఠం మండలం కేశాపురం గ్రామానికి చెందిన భారీ సెట్టింగులతో కులుకు భజన నిర్వహిస్తారు. అలాగే తువ్వపల్లె, మున్నెల్లి, బోడు గుండుపల్లె గ్రామాల నుంచి సుడిబండి, చెక్కభజన పోటీలు, బండలాగుడు పోటీలు అల్లెంగుండు ఎత్తుట తదితర కార్యక్రమాలు నిర్వహి స్తారు. 27న బుధవారం తీర్థ ప్రసాదాలతో తిరుణాల ముగుస్తుంది. భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ప్రభాకరరెడ్డి తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22: గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతిపై ప్రభుత్వం విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కోకన్వీనర్ హరిత డిమాండ్ చేశారు.విద్యార్థిని మృతిపై గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థిని నవ్య ఆత్మహత్యపై విచారణ జరిపి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కార్యదర్శి పీటర్, లక్ష్మినారాయణ, బన్ని, సోని తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22: నీరు చాలా విలువైందని, నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్‌రవి తెలిపారు. శుక్రవారం వరల్డ్ వాటర్‌డే సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి, కన్వీనర్ చిన్నసురేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో హోరెత్తిన టీడీపీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి ,కొండారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 22 : ప్రొద్దుటూరులో టీడీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. శుక్రవారం ఉదయం ప్రొద్దుటూరులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో నంద్యాల వరదరాజులరెడ్డి కొండారెడ్డి పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ తదితరులు వరదరాజులరెడ్డి, కొండారెడ్డికి సన్మానం చేశారు. అనంతరం అమ్మవారి శాల నుంచి కార్యకర్తలతో టీడీపీ ఎన్నికల ప్రచారం యాత్ర ప్రారంభమయింది.ర్యాలీ మెయిన్‌బజార్, దర్గాబజార్, గంగమ్మదేవళం వీధుల గుండా పొట్టి శ్రీరాములు సర్కిల్, శివాలయం వరకు సాగింది. దర్గా బజార్‌లోని చౌసెన్‌వలి దర్గాలో వరదరాజులరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీలు రాఘవరెడ్డి,గురివిరెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరద ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ప్రొద్దుటూరులో వైసీపీ వీడి టీడీపీలో చేరికలు భారీగా వుండబోతున్నాయని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 30 వవార్డులో వైసీపీ నాయకుడు మైనాగారీ నాగేంద్ర ప్రసాద్ నాయకత్వంలో వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వరద మాట్లాడుతూ త్వరలో వైసీపీ ముఖ్య నేతలందరూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యేను వీడి టీడీపీలోకి రాబోతున్నారన్నారు. ఎన్ని తాయిలాలు, ప్రలోభాలకు గురిచేసినా రాచమల్లును నమ్మి అక్కడవుండేలమని చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల రాఘవరెడ్డి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ మహ్మద్ గౌస్, బచ్చలప్రతాప్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సీఐ రామాంజులు

ఖాజీపేట, మార్చి 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియమావళి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ రామాంజులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా రాజకీయ పార్టీలు, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల నియమాలు ఉల్లంఘించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు రెచ్చగొట్టేలా చేయడం, దీనికి ప్రతి విమర్శలు కూడా చేయకూడదన్నారు. రెచ్చగొట్టే విధంగా ఉన్నట్లయితే కేసు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

గోపవరం... ఎన్నికలనిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో రాధాక్రిష్ణ, ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా



రాత్రి సమయంలో తరలిపోతున్న ఇసుక

జమ్మలమడుగు, మార్చి 22: జమ్మలమడుగు-మైలవరం ప్రాంతాల్లోని పెన్నానది వద్ద నుంచి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని వైసీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అక్రమ రవాణా విషయంలో ఇటీవలే ఒకరిపై ఒకరు సమాచారం ఇచ్చారని గొడవ జరిగి కేసుల వరకు వెళ్లారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యతోనే విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 22: విద్యతోనే విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐసీడీఎస్ బాలికల సంరక్షణ అధికారి జి.సునీత పేర్కొన్నారు. శుక్రవారం మేదరవీధిలోని అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటీ పఢావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఏవైనా సమస్యలు ఉంటే 1098 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ లక్షుమ్మ, అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న రోడ్డు..తొలగించని వ్యర్థాలు



జమ్మలమడుగు, మార్చి 22: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో పలగాడి వీధిలో ప్రధాన రోడ్డు,మరికొన్ని చోట్ల చెత్తకుండీలు నిండి వ్యర్థాలన్నీ రోడ్డుపై పడ్డాయి. చెత్తకుండీలో చికెన్ సెంటర్ల వారు కోళ్ల వ్యర్థపదార్థాలన్నీ పడవేయడంతో స్థానికంగా చుట్టుపక్కల దుకాణాల వారికి రోడ్డు పక్కనే నడిచి వెళ్లేవారు కంపు భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఆవులు చెత్తాచెదారాన్ని కిందపడవేసి అపరిశుభ్రంగా చేశాయి. అలాగే మరికొన్ని చోట్ల డ్రైనేజీ కాలువలు శుభ్రతకు నోచుకోలేదని పలగాడి వీధిలోని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అలాగే పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణం వ్యర్థపదార్థాలతో నిండి ఉంది. కార్యాలయాల వెనుక,ముందు భాగంలో పారిశుధ్యం పడకేసింది. ఎంపీడీవో ముజఫర్‌కు 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలియజేసి కాంపౌండ్‌లో వ్యర్థాలు తొలగించలేని దుస్థితిలో ఉన్నారు. ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో చర్యలు తీసుకోవాలని అడుగగా నిజమే, మున్సిపల్ అధికారులకు ఇప్పటికే తెలియజేశామని వారు స్పందించడంలేదని ఆయన తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

బద్వేలు టౌన్, మార్చి22: పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం సమీపంలో సీపీఐకి చెందిన వీరశేఖర్, అనిల్, ఇమ్మానియల్, బాల ఓబయ్య, పగిడి రమణ, వెంకటరమణ, శ్రీనివాసులుపై మునిసిపల్‌కమిషనర్ క్రిష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మునిసిపల్ కార్యాలయం సమీపంలోని ఎన్జీవో రోడ్డులో గతంలో టిడ్కో ఇళ్లకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో సీపీఐకి చెందిన కొందరు నాయకులు మరికొంత మంది ప్రజలతో కలిసి జాగాను కబ్జా చేసేందుకు గుడిసెలు వేశారు. అక్కడ ఉన్న వారిని రెచ్చగొట్టే విధంగా నినాదాల చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించడంపై కమిషనర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

ప్రారంభమైన పసుపు తవ్వకాలు

చాపాడు, మార్చి 22: మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగు చేసిన పసుపును రైతులు తవ్వుతున్నారు. సీతారామపురం, భద్రిపల్లె, కేతవరం, లక్ష్మీపేట, చిన్నగురవలూరు, ఓబుళరెడ్డిపేట, రాజుపాళెం, వెదురూరు గ్రామాల వద్ద సుమారు 300 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్ జూలై నెలలో ఈ పైరు సాగు చేశారు. ప్రస్తుతం కూలీలు పారకోళ్లతో తవ్వుతున్నారు. ఒక ఎకరా తవ్వినందుకు రైతులు రూ.5,500 కూలీలకు ఇస్తున్నారు. పది లేదా 15 మంది పురుష కూలీలు గుంపులుగా ఏర్పడి తవ్వకం పనులు చకచకా చేస్తున్నారు. మహిళా కూలీలు కూడా గుంపులుగా ఏర్పడి పసుపు కొమ్ములు విరుస్తున్నారు. విరిసిన పసుపు కొమ్ములను పొలాల్లోనే రాశులుగా పోస్తున్నారు. రైతులు ఒక మహిళా కూలీకి రోజుకు మధ్యాహ్నం వరకు రూ.200 ఇస్తున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు.





పసుపును తవ్వుతున్న కూలీలు, విరుస్తున్న మహిళలు